క్లుప్తంగా

శాశ్వత అన్నదానానికి రూ.20 వేలు


లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తవిటిరాజుకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి పట్టణానికి చెందిన మల్లపురెడ్డి రమేష్, సురేష్ సోదరులు రూ.20 వేల విరాళం అందజేశారు. నగదును లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కె.తవిటిరాజుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తవిటిరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు మల్లపురెడ్డి సత్యనారాయణ డిసెంబర్ 24న మృతి చెందారని, ఆయన జ్ఞాపకార్థం కుమారులు రమేష్, సురేష్ ఆర్థిక సహాయం చేశారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూరీసర్వే పనుల పరిశీలన


సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ అప్పారావు

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని పోతాయ వలస, పుర్రేయవలస గ్రామాల్లో చేపడుతున్న సర్వే పనులను చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ భూరీ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సర్వే చేసే సమయాల్లో రైతులు తమ పొలాల వద్ద ఉండి సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు ఉన్నారు.

సింహాద్రి అప్పన్న పల్లకీ సేవ


ఎస్.కోటలో సింహాద్రి అప్పన్నస్వామి ఊరేగింపు

శృంగవరపుకోట: సింహాచలం అప్పన్న స్వామి పల్లకీ సేవను మేళతాళాల మధ్య అప్పన్న మాలధారులు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షిర్డీసాయి దేవాలయం నుంచి పెద్దవీధి వరకు నిర్వహించిన ఊరేగింపులో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భజనలు చేస్తూ, పాటలు పాడుతూ స్వామి వారిని ఆరాధించారు. కొందరు భక్తులు నృసింహస్వామి, వరాహ స్వామి వేషధారణలతో అలరించారు. పట్టణ వాసులు పలువురు స్వామి వారిని దర్శించుకుని పూలు, పండ్లు సమర్పించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం


అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు

చీపురుపల్లి: జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ పి.ఉమామహేశ్వరరావు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యం, సిగరెట్, గుట్కా వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతం కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సతీష్, ఎస్ఈబీ ఎస్ఐ పి.సత్యనారాయణ సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత


గుర్ల: విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యవతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు

గుర్ల/ వేపాడ: గుర్ల మండలంలోని భూపాలపురం గ్రామానికి చెందిన ఉప్పల సత్యవతి, కోరాడ అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతూ, వేపాడ మండలంలోని భర్త వానిపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఎస్. రాములమ్మకు కాలు విరిగిపోవడంతో విశాఖపట్నంలోని ఆస్పత్రుల్లో వేర్వేరుగా చికిత్స పొందుతున్నారు. వీరికి జనవరి నెలకు సంబంధించిన పింఛన్ డబ్బులను వలంటీర్లు సుంకరి నారాయణరావు, సుంకరి రామునాయుడు సతీష్ మంగళవారం ఆ హాస్పిటళ్లకు వెళ్లి అందజేశారు. వలంటీర్లను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అభినందించారు.

పేదలకు అండగా ప్రభుత్వం


లక్కవరపుకోట: ఎల్.కోటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- పింఛన్ మొత్తాన్ని పెంచి మాటనిలబెట్టుకున్న సీఎం జగన్
- ఎస్.కోట నియోజకవర్గ ప్రజలకు వివిధ పథకాల ద్వారా రూ.900 కోట్లు
- పింఛన్ల పెంపు వారోత్సవాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


కొత్తవలస: కొత్తవలసలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


కొత్తవలసలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు,నాయకులు, వలంటీర్లు


చీపురుపల్లిరూరల్: రామలింగాపురంలో లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, సర్పంచ్


గుర్ల: భూపాలపురంలో ఇంటికి వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు


మెరకముడిదాం: ఊటపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి

కొత్తవలస/లక్కవరపుకోట: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు అమలు చేస్తున్నారని, అన్ని వర్గాల్లోని పేదలకు తమ ప్రభుత్వం అండగా ఉంటోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస, ఎల్.కోట మండల కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పింఛన్ పెంపు వారోత్సవాలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. నూతనంగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడుతూ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నేటి వరకు ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని ఎల్.కోట, వేపాడ, జామి ,ఎస్.కోట, కొత్తవలస మండలాల ప్రజలకు వివిధ పథకాల ద్వారా రూ.900 కోట్లను ఒక్క రూపాయి అవినీతి జరగకుండా పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఎం జగన్ ఏదైనా మాట ఇచ్చారంటే దాన్ని చేసి చూపిస్తారని అన్నారు. చెప్పిన ప్రకారం పింఛన్ మొత్తాన్ని మూడో ధపా రూ.250


చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు, తదితరులు

పెంచి మొత్తంగా రూ.2,750 అందిస్తున్నారని చెప్పారు. కొత్తవలస మండలంలో నూతనంగా 290 మందికి, ఎల్.కోట మండలంలో 213 మందికి కొత్తగా పింఛన్‌లు మంజూరయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వంలో అరకొరగా పథకాలు అమలయ్యేవని, వాటిని సైతం లంచాలు ఇచ్చిన వారికే జన్మభూమి కమిటీలు మంజూరు చేసేవని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేసి తలుపుతట్టి


బొండపల్లి: గొట్లాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సరోజిని, పీఏసీఎస్ చైర్మన్ రమణ

అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో కొన్నిపార్టీల నాయకులు మాయమాటలు చెప్పుకుంటూ వస్తారని వారికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడు బాబు మాట్లాడుతూ పింఛన్ల పెంపుతో పేదలకు ముందే సంక్రాతి పండగ వచ్చిందన్నారు. ప్రజాసంక్షేమ పాలనపై కొన్ని పార్టీలు, వారి అనుకూల మీడియా కారుకూతలు కూస్తూ, రాస్తూ ఉన్నవి లేనట్టు, లేనిది ఉన్నట్లు అంతా కనికట్టు వేషాలు వేస్తున్నారని, వాటిని ప్రజలు గమనించాలని కోరారు. కొత్తవలస,ఎల్.కోట ఎంపీడీఓలు వై.పద్మజ, కె.రూపేష్, ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు,నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీలు తూర్పాటి వరలక్ష్మి,నెక్కలి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు ఆవాల శ్యామల, డి.కుమారి, కర్రి శ్రీను, ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, కొత్తవలస పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

చీపురుపల్లి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సామాజిక పింఛన్లు మంజూరు చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని గ్రామ సచివాలయం-5 పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వార్డు మెంబరు కుప్ప రాంబాయితో కలిసి మంగళవారం పంపిణీ చేశారు.నాయకులు పతివాడ రాజారావు, శేఖర్ గుప్త, ప్రభాత్, మాజీ ఎంపీటీసీ శ్రీదేవి, అలిగి శ్రీను పాల్గొన్నారు.

- చీపురుపల్లిరూరల్: మండలంలోని పుర్రేయవలస,రామలింగాపురం గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మతో కలిసి వెళ్లి పింఛన్ అందజేశారు.మండల నాయకుడు ఇప్పిలి అనంతం, మాజీ సర్పంచ్‌లు కంది పాపినాయుడు, కంది అప్పారావు,నాయకులు జమ్ము అప్పలనాయుడు,శ్రీరాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- బొండపల్లి: గొట్లాం సచివాలయంలో లబ్ధదారులకు వైస్ ఎంపీపీ మీసాల సరోజిని,గొట్లాం పీఏసీఎస్‌చైర్మన్ మహంతి రమణ మంగళవారం పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. సర్పంచ్ మండా ఆదిలక్ష్మి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల: భూపాలపురంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

- మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లిలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ సోదరి, ఆ గ్రామ సర్పంచ్ సంగంరెడ్డి వెంకటలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

నేడు వేపాడలో..

వేపాడ: పింఛన్ల పెంపు వారోత్సవ కార్యక్రమం మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.ఎస్.ఎస్.కె.పట్నాయక్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అతిథిగా పాల్గొని నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తారని చెప్పారు. అన్ని సచివాలయాల పరిధిలోని నూతన పింఛన్‌దారులు ,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ వలంటీర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు


ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

చీపురుపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి పాతబస్టాండ్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రానికి రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సిబ్బందితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తక్షణమే ప్రహరీ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు మంజూరు చేశామని చెప్పారు. ఐసీడీఎస్ పీఓ కె.వి.రాజేశ్వరి, సూపర్‌వైజర్ కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, పతివాడ రాజారావు, కెల్ల మోహనరావు, ఇప్పిలి కృష్ణ, పాండ్రంకి వాసు, దాలయ్య, అంగన్‌వాడీ కార్యకర్త భారతి పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం


అపరాల పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

జామి: రైతులు పంటల మార్పిడిలో భాగంగా వరి పంట తర్వాత అపరాలు, మొక్కజొన్న, రాగులు, నువ్వులు సాగు చేసు కుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని చింతాడ గ్రామంలో అపరాల పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. జాగ్రత్తలు పాటిస్తూ అపరాలు సాగుచేస్తే ఎకరానికి 3.5 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. అపరాలకు ప్రభుత్వం మద్దతు ధర పెంచిందని చెప్పారు. అనంతరం గ్రామం లోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం పరిధిలో ధాన్యం సేకరణపై ఏఓ కిరణ్ కుమార్, వీఏఏ స్వాతిని ఆరా తీశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం విప్లవం కొనసాగు తోందని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని అలమండ గ్రామంలో మంగళవారం' గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, వర్గాలకు తావు లేకుండా అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. అవినీతి రహిత, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో బాసటగా నిలవాలని ప్రజలను కోరారు. ప్రతిపక్ష పార్టీలు చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, జన్నివలస సర్పంచ్ శీర చందునాయుడు , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

భారతదేశ తొలితరం ఉపాధ్యాయినిగా ఖ్యాతి గడించిన సావిత్రి బాయి పూలేను మహిళలు, ఉపాధ్యాయులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని పలు వురు వక్తలు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటాలకు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గుర్ల కేజీబీవీలో నిర్వహించిన వేడుకలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథిగా హాజరయ్యారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. - సాక్షి నెట్‌వర్క్


గుర్ల: గుర్ల కేజీబీవీలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


కొత్తవలస: సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు, తదితరులు


చీపురుపల్లి: ఎంఈఓ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


శృంగవరపుకోట: సంతగవిరమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులకు సన్మానం


గజపతినగరం: యూటీఎఫ్ ఆధ్వర్యంలో పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఎల్.కోట: ఎల్.కోటలో సావిత్రి బాయిపూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విశ్వబ్రాహ్మణులు


గజపతినగరం రూరల్: మరుపల్లి పీహెచ్‌సీలో నివాళి అర్పిస్తున్న వైద్యసిబ్బంది


గజపతినగరం: పురిటిపెంటలో నివాళి అర్పిస్తున్న విద్యా జిల్లా ఉపాధ్యక్షురాలు హరికృష్ణవేణి, తదితరులు


వేపాడ: బక్కునాయుడుపేటలోని మోడల్ స్కూల్‌లో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సంక్షిప్తంగా...

వేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ


స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన పులిహోర, స్వీట్లు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని భీమసింగి వేంకటేశ్వస్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ(అన్నకూటోత్సవం) మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పాతబగ్గాంలో 'ఫ్యామిలీ డాక్టర్'

గజపతినగరం రూరల్: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 73 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహ సందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేశారు. డాక్టర్ అనూజ్‌రాయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

బొండపల్లి: మండలంలో నూతనంగా మంజూరైన 345 పింఛన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం పంపిణీ చేయనున్నారని ఎంపీపీ చల్ల చలంనాయుడు మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు, లబ్ధిదారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు

శృంగవరపుకోట: పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ సంతోషికుమారి తెలిపారు. శ్రీనివాసకాలనీ, మొండివీధుల్లో దోమల నివారణ మందును పంచాయతీ సిబ్బందితో మంగళవారం పిచికారీ చేయించారు. ఎస్‌యుఓ నందయ్య, హెల్త్ అసిస్టెంట్లు టి.శంకరరావు, టి.రామకృష్ణ, పంచాయతీ శానిటేషన్ మేస్త్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

మెరకముడిదాం: 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు 11వ పీఆర్‌సీ అమలులో ఆర్థికంగా బాగా నష్టం జరిగిందన్నారు. ఈనష్టాన్ని భర్తీ చేసేందుకు అనామలస్ కమిటీని వేయడంతో పాటు 11 వ పీఆర్‌సీ కాలం పూర్తికావస్తుండడంతో జూలై 1 నాటికి 12వ పీఆర్‌సీ రిపోర్టు వచ్చేవిధంగా కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.శివున్నాయుడు, మండలశాఖ అధ్యక్షుడు ఎన్.సూర్యనారాయణ, విజయనగరం జిల్లాశాఖ కార్యదర్శులు అప్పలరాజు,సత్యారావు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీకి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: మండలంలో అరిగిపాలెం గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్ నిర్మాణానికి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు మగళవారం భూమిపూజ చేశారు. రూ.5.5 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో షెడ్ నిర్మించనున్నామని ఎంపీపీ తెలిపారు. ఎంపీడీఓ పట్నాయక్, ఎంపీటీసీ టి.వి.రమణ, గ్రామపెద్దలు దుల్ల సన్యాసిరావు, దుల్ల వెంకటరమణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఉపాధి హామీ ఏపీఓ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.